క్లుప్తంగా

డాక్టర్ కృష్ణకు ఐఎన్ఎస్ఏ విజిటింగ్ ఫెలోషిప్



పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణ భారత జాతీయ సైన్స్ అకాడమి (ఐఎన్ఎస్ఏ) విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. ఆ విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐఎన్ఎస్ఏ మార్గదర్శకాల ప్రకారం ఫెలోషిప్ అనేది భారతీయ పరిశోధన సంస్థలు/ప్రయోగశాలల్లో ప్రత్యేక శిక్షణ పొందడానికి ఉద్దేశించినదన్నారు.

ఆర్టీసీలో కాలనీలకు బస్సు ఆఫీసర్ల నియామకం



మాట్లాడుతున్న ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత

పటాన్‌చెరు టౌన్: హెచ్‌సీయూ డిపో పరిధిలోని వివిధ కాలనీలకు ఆర్టీసీ కాలనీ బస్సు ఆఫీసర్లను నియమించినట్లు ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ, ప్రయాణికులకు మధ్య కాలనీ బస్సు ఆఫీసర్లు వారధిగా పని చేస్తారన్నారు. వీరికి కేటాయించిన కాలనీల్లో ప్రతీనెలా ప్రయాణికులతో రెండు సమావేశాలు నిర్వహించి, వారి అవసరాలను అధికారులకు తెలియచేసి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య , ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు, ఆర్టీసీ బస్టాండ్ సిబ్బంది, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 35, పచ్చిమిర్చి 65, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 130, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 140

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: కొండాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు కొండాపూర్ ఏఈ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు భిక్షపతినగర్, ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్స్, జూబ్లీ గార్డెన్, రాఘవేంద్రకాలనీ, రాజరాజేశ్వరి నగర్, జయభేరి అపార్ట్‌మెంట్స్, జాగృతి కాలనీ, ఆనంద్‌నగర్ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.

మనూ 'మెగా జాబ్ ఫెయిర్'కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించే మెగా జాబ్ ఫెయిర్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్(టీఅండ్‌పీసీ), గేలాక్సీ ప్లేస్‌మెంట్ సర్వీసెస్, అసోసియేషన్ ఆఫ్ ముస్లీమ్ ప్రొఫెషనల్స్(ఏఎంపీ) సంయుక్తంగా ఈ మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. ఈనెల 12వ తేదీన యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో దీన్ని నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇది కొనసాగుతుంది. ఈ ఫెయిర్‌లో 50 కంపెనీలు, సంస్థలు, ఎంఎన్‌సీలు, ఫెడరేషన్లు, సంస్థలు కలిసి 4వేల ఖాళీలను భర్తీ చేయడానికి దీన్ని నిర్వహిస్తారు.

నిర్మాణరంగంలో నూతనత్వం కావాలి

మణికొండ: ప్రజలు అన్ని రంగాలలో కోరుకుంటున్నట్లుగానే నిర్మాణ రంగంలోను నూతనత్వాన్ని కోరుకుంటున్నారని, వారి అభిరుచికి తగ్గట్టుగా నిర్మాణాలను చేపడితేనే నిర్మాణ సంస్థలు రాణిస్తాయని మైహోం గ్రూప్ సీనియర్ ప్రెసిడెంట్ ఎంకే రవిసాయి అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల సివిల్ ఇంజనీరింగ్ విద్య, వైజ్ఞానిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఉన్న దాంట్లో ఉత్తమంగా నిర్మాణాలను తీర్చి దిద్దేందుకు యువ ఇంజనీర్లు నూతన ఆలోచనలు చేయాలన్నారు. మై హోం గ్రూప్ కార్పొరేట్ క్వాలిటీ జనరల్ మేనేజర్ నాగరెడ్డయ్య పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న ఆరోగ్య కేంద్రం



శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

రూ.45 లక్షలు అందించేందుకు ముందుకొచ్చిన 'రహేజా గ్రూపు'

- శేరిలింగంపల్లిలో మరిన్ని వైద్య సౌకర్యాలు

శేరిలింగంపల్లి: పేద,మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలందించేందుకు కొనసాగుతున్న శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు ఇక మారనున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పురాతనమైనదేకాకుండా ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఆస్పత్రి కావడంతో ఇది ఎంతో ముఖ్యమైనదిగా గుర్తింపు ఉంది. ఇందులో మరిన్ని సౌకర్యాలు అందుబాటు లోకి రానున్నాయి. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, రంగారెడ్డిజిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు చొరవతో సీఎస్ఆర్ నిధులను కేటాయించేందుకు 'రహేజా గ్రూప్' ముందుకొచ్చింది. పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత మేలు చేకూరేలా చేసేందుకు వారు రూ.45 లక్షలు కేటాయించేందుకు అంగీకరించారు. మే 30వ తేదీన ఎమ్మెల్యే,ఎంపీలు రహేజా గ్రూపు ద్వారా అందించిన రూ.45 లక్షల చెక్కును జిల్లావైద్యాధికారులకు అందించారు. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ లో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో పేద,మధ్య తరగతి వారికి ఎంతో మేలు చేకూరే అవకాశం కలుగుతుంది.

రహేజాగ్రూప్ సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనులు ఇవే...

- ఆస్పత్రి వెనుక ఉన్న పురాతన షెడ్డు స్థానంలో అనువైన భవనాన్ని నిర్మించాలని తలపెట్టారు.
- ఈ భవనం అందుబాటులోకి వస్తే మరింతగా వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు సౌకర్యాలు మెరుగు పడతాయి.
- ప్రస్తుతం ఉన్న భవనంలో టీబీసెంటర్, ల్యాబ్స్‌ను నిర్వహించాలని నిర్ణయించారు.
- కొత్త భవనంలో ఓపీ, ఆఫీస్ రూమ్, డాక్టర్ల గది, ఫార్మసీ, స్టాఫ్ గదులు ఉండేలా ఏర్పాట్లు చేయాలని తలపెట్టారు.

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అవకాశం



ప్రభుత్వం ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం సీఎస్ఆర్ కింద రహేజా గ్రూపు ముందుకొచ్చి నిధులు ఇచ్చేందుకు రావడం హర్షణీయం. ఇలాంటి సంస్థలు మరిన్ని ముందు కొస్తే పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ నిధుల కేటాయింపులో ప్రజా ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవడం సంతోష దాయకం.రాబోయే కాలంలో మరిన్ని సేవలు రోగులకు అందించేలా అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ శైలజ, మెడికల్ ఆఫీసర్, శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ

ఎఫ్ఐఆర్ నమోదు షురూ



నూతన కొల్లూర్ పోలీస్‌స్టేషన్

నేడు కొల్లూర్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సైబరాబాద్ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ శనివారం రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ హరీశ్‌రావు చేతుల మీదగా ప్రారంభోత్సవం కానుంది. దీంతో నేటి నుంచి కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐఆర్‌లు నమోదు కానున్నాయి. మహానగరానికి శివారు ప్రాంతమైన తెల్లాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతోంది. దీంతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో విల్లాస్ కొనుగోలు చేసేందుకు ప్రముఖులు, ఉన్నతస్థాయి ఉద్యోగులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. వీటికి తోడు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం రెండు పడకల బహుళ అంతస్తుల ఇళ్లలను నిర్మించారు. కొత్త కాలనీలు ఏర్పడటం, జనాభా పెరగడంతో ప్రజలకు రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కొల్లూర్‌కు పోలీస్‌స్టేషన్ మంజూరు చేసింది. పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించకపోవడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చొరవతో ఉస్మాన్‌నగర్‌లోని వార్డు కార్యాలయం ప్రాగంణంలో తాత్కాలికంగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం త్వరలో మూడెకరాలు కేటాయించనున్నట్లు తెలిసింది. నెల క్రితం కొల్లూర్ పోలీస్‌స్టేషన్ మంజూరైనప్పటికీ ఎఫ్ఐఆర్‌లు రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లోనే నమోదు అయ్యాయి. కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌కు 50 మంది సిబ్బందిని ప్రభుత్వం మంజూరు చేయగా, ఇప్పటి వరకు 25 మంది బదిలీపై వచ్చారు. కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొల్లూర్, దేవులతండా, బోజ్యాతండా, ఉస్మాన్‌నగర్, తెల్లాపూర్, సైబర్‌కాలనీ, మియాఖాన్‌గడ్డ, ఇందిరారెడ్డినగర్ కంచ రానున్నాయి. పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, డీసీపీ శిల్పవల్లి, మాజీ శాసన మండలి ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి పాల్గొనున్నారు.

నేటి నుంచి అందుబాటులోకి..



కొల్లూర్ పోలీస్‌స్టేషన్ నేటి నుండి అందుబాటులోకి రానుంది. పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాం. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు.

– సంజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్

వరదనీటి పనులను పరిశీలించిన కార్పొరేటర్



మియాపూర్: చందానగర్ ఇందిరానగర్ కాలనీలో వరదనీటి పనులను కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాలనీలో నూతనంగా చేపట్టిన వరదనీటి కాల్వ పనులను వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వర్షకాలంలో కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈఈ శ్రీకాంతిని, ఏఈ సంతోష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: దేశంలో ఏరాష్ట్రంలో లేనన్ని పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చందానగర్ డివిజన్‌లోని అంబేద్కర్ కళ్యాణ మండపంలో సంక్షేమ సంబరాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ దార్శనికత, మార్గదర్శకంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ యుగంగా విరాజిల్లుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా రూ.3కోట్ల94వేల800 ఆసరా ఫించన్ల కోసం చెక్కును అందజేశారు. కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, హమీద్‌పటేల్, శ్రీనివాస్ రావు, తహసీల్దార్ వంశీ మోహన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

తాళం వేసిన ఇంట్లో చోరీ

కంగారులో సెల్‌ఫోన్ వదిలివెళ్లిన దొంగలు



బీరువా పగలగొట్టి తీసి వస్తువులు చిందరవందరగా పడేసి..

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం...పట్టణంలోని సాయిరాంకాలనీకి చెందిన కమల్‌ఉద్దీన్ శాంతినగర్‌కాలనీలో ఉండే తల్లిదండ్రుల వద్దకు గురువారం ఉదయం వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి రాగా అప్పటికే ఇంట్లో ఉన్న ఇద్దరు దొంగలు ఇది గమనించి అక్కడి నుంచి పరారయ్యారు. అయితే దొంగతనానికి వచ్చిన దొంగ తన సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుని మరి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యారు. దొంగలు చార్జింగ్ పెట్టిన సెల్ వదిలేసివెళ్లారు. బాధితుడు ఇంట్లోకి వెళ్లి చూడగా 12 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.24 వేల నగదు దొంగలించినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు క్లూస్‌టీం బృందంతో కలిసి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా స్థలం నాకు ఇప్పించాలి

ముఖ్యమంత్రి స్పందించాలని బాధితురాలు విజ్ఞప్తి



స్థలంలోకి ఎమ్మెల్యే అక్రమంగా ప్రవేశించిన ఫొటోలు చూపుతున్న బాధితురాలు

పంజగుట్ట: తమ స్థలం కబ్జాచేయడమే కాకుండా.. సెల్‌ఫోన్, కారులో ఉన్న నగదు, విలువైన పత్రాలు ఎత్తుకెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వృద్ధురాలు ఎం.పుష్పవతి ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ సర్వే నం.100లో 3వేల ఎకరాల స్థలాన్ని 2006లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. తనస్థలంపై కన్నేసిన స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అతని అనుచరులైన స్థానిక కార్పొరేటర్, బస్తీ నాయకులు తన స్థలం కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్‌లో ఎమ్మెల్యే అనుచరులు తమ స్థలంలోకి ప్రవేశించారన్నారు. అక్కడున్న వారిపై దాడి చేసి ఖరీదైన సెల్‌ఫోన్, 1.20 లక్షల నగదు, విలువైన పత్రాలు అన్ని ఎత్తుకెళ్లారని తెలిపారు. బూతులు తిడుతూ తన స్థలం నుంచే తనను బయటకు నెట్టేశారని తెలిపారు.

- గత నెల 13వ తేదీన తిరిగి తన స్థలంలో 30 ట్రాక్టర్ల మట్టిని పోసి చుట్టూ ఉన్న హద్దురాళ్లను తొలగించి కబ్జాకు యత్నించారని తెలిపారు. జీహెచ్ఎంసీ వారు సర్వే చేసి ఈ స్థలం తనదే అని నిర్ధారించారని అయినా ఎమ్మెల్యే, అతని అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. తాను ఒంటరి మహిళని, భర్త చనిపోయాడు, ఇద్దరు ఆడపిల్లలు పెళ్లి చేసుకుని అమెరికాలో ఉంటున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్పందించి తన స్థలం తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో న్యాయవాది శివశంకర్, సీహెచ్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలను ఖండిస్తున్నా: ఎమ్మెల్యే

సాక్షి, సిటీబ్యూరో: ఓ స్థల వివాదం విషయంలో తనపై వస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఖండించారు. ఎవరైతే ఆరోపణలు చేస్తున్నారో వారే తన వద్దకు వచ్చి వారి స్థలంలో రౌడీలు వచ్చి బీభత్సం చేస్తున్నారంటే ఓ ప్రజాప్రతినిధిగా తాను అక్కడకు వెళ్లానన్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందికి వాస్తవాలను తేల్చాలని సూచించానన్నారు.

ఆ తర్వాత తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ నకిలీ స్టాంప్ పేపర్లు సృష్టించి ప్రజాప్రతినిధులపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆ స్థలానికి తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

చదువుతోపాటు ఇతర రంగాల్లో కూడా రాణించాలి



విజేతలకు బహుమతులను అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు

రాయదుర్గం: చదువుతోపాటు విద్యార్థుల ఇతర అన్ని రంగాలలో కూడా రాణించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో వార్షిక ఇంటర్ హస్టల్స్ స్పోర్ట్స్, కల్చరల్, లిటరరీ ఫెస్ట్ ముగింపు సందర్భంగా విజేతలకు బహుతులు, సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతియేటా క్రీడలు, సంస్కృతి, లిటరరీ ఫెస్ట్ పేరిట పోటీలను వారం రోజులపాటు నిర్వహించి విజేతలకు బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, ఓఎస్‌డీ–2 ప్రొఫెసర్ సిద్ధిఖీ మోహద్ మహమూద్ పాల్గొన్నారు.

13 నుంచి 'మనూ'లో జీ-20 స్పెషల్ ఫిల్మ్ ఫెస్టివల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ ఆధ్వర్యంలో జీ-20 యూనివర్శిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జూన్ 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఫిల్మ్ ఫెస్టివల్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా తెలుగు బ్లాక్‌బస్టర్ సినిమా ఆర్‌ఆర్‌ఆర్ ప్రారంభ సెషన్‌లో ప్రదర్శించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. మూడు రోజులపాటు సాగే ఈ ఈవెంట్‌లో జీ-20 దేశాల నుంచి మొత్తం 17 సినిమాలు కూడా ప్రదర్శిస్తారు. 13వ తేదీన ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభ సమావేశం ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ ఆహ్మద్ అధ్వర్యంలో జరిగే సమావేశంలో ఏపీ, తెలంగాణకు బ్రిటీష్ డిప్యూటీ హైకమీషనర్ గారెత్‌విన్‌ఓవెన్ ముఖ్యఅతిథిగా జరిగే ఈ సమావేశానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు.

సీఐఎస్‌సీఈ ఫుట్ టోర్నీ షురూ



రాయదుర్గం: ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్(సీఐఎస్‌సీఈ) స్కూల్స్ మధ్య ఫుట్‌బాల్ టోర్నీని నిర్వహించారు. గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్ క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ టోర్నీ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నాసర్ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపల్ మీర్ హఫీజుద్దిన్ ఆహ్మద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ టోర్నీలో ఫైనల్‌కు నాసర్ బాయ్స్ స్కూల్, హెచ్‌పీఎస్ బేగంపేట్ జట్లు చేరాయి, మొదటి సెమీఫైనల్‌లో హెచ్‌పీఎస్ బేగంపేట్ జట్టు నానక్‌రాంగూడ ఫ్యూచర్‌కిడ్స్ జట్ల మధ్య సాగింది, ఇందులో పెనాల్టీ షూట్‌ఔట్‌లో 4–3 స్కోరుతో హెచ్‌పీఎస్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. కాగా రెండవ సెమీఫైనల్ పోటీలో నాసర్ బాయ్స్ స్కూల్ జట్టు, గుంటూరు లయోలా స్కూల్ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. చివరకు ఈ పోటీలో పెనాల్టీ షూట్ ఔట్‌లో 5–3 స్కోరుతో నాసర్ బాయ్స్ స్కూల్ జట్టు ఫైనల్‌కు చేరింది. ఫైనల్ పోటీ నాసర్ బాయ్స్ స్కూల్, హెచ్‌పీఎస్ బేగంపేట్ జట్ల మధ్య నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రేమ్‌నగర్‌లో బీజేపీ పాదయాత్ర

హఫీజ్‌పేట్: గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పాదయాత్రలు చేపట్టిన కార్యక్రమానికి 50 రోజులు పూర్తి అయ్యాయి, శుక్రవారం రాత్రి కొండాపూర్ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్‌కు భారీ గజమాలతో బీజేపీ నాయకులు సత్కరించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పట్ల ప్రజలు నమ్మకం కోల్పోయారని, బీజేపీకి జైజైలు కొడుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అధికారం ఇచ్చిన ప్రజలు ఈసారి బీజేపీ అధికారంలో తీసుకొస్తే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారనే భావన అందరిలోనూ కనిపిస్తోందన్నారు.

మహ్మద్ అద్నాన్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అనువాద అధ్యయనాల విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ అద్నాన్‌కు ఈ పీహెచ్‌డీ డిగ్రీని శుక్రవారం ప్రకటించారు. అనువాద విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫహీముద్దీన్ ఆహ్మద్ పర్యవేక్షణలో 'అరబిక్ సాహిత్యం యొక్క ఉర్దూ అనువాద రచనలు: ఒక అవలోకనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు.

అభివృద్ధి.. సంక్షేమ సంబురం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతీ ఇంటా సంక్షేమం, గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 8వ రోజు శుక్రవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో నియోజకవర్గ స్థాయి సంక్షేమ సంబరాలు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలి అన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతతో లబ్ధిదారులను ఎంపిక చేసి సకాలంలో పథకం అమలయ్యేలా చేస్తున్నామన్నారు. దేశంలోనే మొదటిసారిగా దళితులు ఆర్థిక అభ్యున్నతి కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. బీసీ వర్గాలలోని కులవృత్తులు చేసుకునే వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు అందజేసి బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవానందం , సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు రోజా బాల్‌రెడ్డి, లలిత సోమిరెడ్డి, కార్పొరేటర్లు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కమిటీల చైర్మన్లు, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.